# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి 'జలధార – జలహారతి' కార్యక్రమంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు.**

3. **గృహ నిర్మాణ పథకాల అమలులో గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపడతామని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

4. **రాజధాని అమరావతి అభివృద్ధి కోసం భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

==========================

గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి జలధార – జలహారతి కార్యక్రమంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి దృశ్యమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో వియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి మిగులు ఉన్న ప్రాంతాలను నీటి కొరత ఉన్న ప్రాంతాలతో అనుసంధానించే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జలధార కింద చేపట్టే చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, కంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి వాల్మీకిపురం వాగు అభివృద్ధి నమూనాను పరిశీలించాలని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల సింగపూర్ పర్యటనకు ఈ రోజు బయల్దేరనున్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో సింగపూర్ ప్రధాని, పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. అలాగే స్టార్టప్‌లు, సెమీకండక్టర్ రంగం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల అంశాలపై పలు కీలక సమావేశాల్లో

పాల్గొంటారు. సీఐఐ పార్ట్నర్ షిప్ సమ్మిట్ పెట్టుబడుల సన్నాహక రోడ్‌షోలో పాల్గొంటారు. అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారాయణతో పాటు పలువురు ఉన్నతాధికారులు సింగపూర్‌లో పర్యటిస్తారు.

---------------------------

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలపై హైదరాబాదులోని తన నివాసంలో ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్ తో పాటు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాల కారణంగా నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలను మోహరించాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ముందస్తు ప్రణాళికతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

---------------------------

గృహ నిర్మాణ పథకాల అమలులో గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపడతామని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా, బొల్లవరం హౌసింగ్ లే అవుట్‌ను స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతి అభివృద్ధి కోసం భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలోని హరిశ్చంద్రపురం, వడ్డమాను గ్రామాల్లో నిన్న నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని రైతులతో సమావేశమయ్యారు. భూ సమీకరణ విధానంపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలకు ఈ సందర్భంగా మంత్రి సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'స్కిల్ ఇండియా మిషన్' ద్వారా కోట్లాది మంది యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధాన మంత్రి ప్రోత్సాహంతో దేశంలో స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇది యువతను ఉద్యోగాలు అన్వేషించే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. యువతకు కొత్త

అవకాశాలను కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు, వారి నైపుణ్యాలతో దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చే పునాది వేస్తున్నాయని కిషన్ రెడ్డి వెల్లడించారు.

---------------------------

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర  పేర్కొన్నారు. మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన నిన్న ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటివరకు అందిన 408 వినతుల్లో 318 వినతులను పరిష్కరించామని, మిగిలిన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లవెతుతున్నాయని, పరిశ్రమలు, డేటా సెంటర్లు, స్టీల్ ప్లాంట్లు, తయారీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

---------------------------

'ఆడబిడ్డ నిధి' పథకాన్ని అమలు చేయకుండా 'పీ4' పేరుతో కొత్త కార్యక్రమాన్ని తీసుకురావడం మహిళలను మోసం చేయడమేనని మాజీ మంత్రి, వైఎస్సార్సీపి నాయకురాలు విడదల రజని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి ఆడబిడ్డ నిధి పథకాన్ని పక్కన పెట్టిందని ఆరోపించారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. ఒక్కో మహిళకు రెండేళ్లకు 36 వేల రూపాయల చొప్పున, రాష్ట్రంలోని సుమారు 2 కోట్ల మంది మహిళలకు 72 వేల కోట్ల రూపాయల మేర ప్రభుత్వం బాకీ పడిందని పేర్కొన్నారు.

---------------------------

కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపాలెం, సమిశ్రగూడెం, అట్లపాడు, డి.ముప్పవరం, పెండ్యాల గ్రామాల్లో నిన్న పర్యటించిన ఆయన రెండవ విడత పల్లె పండుగ కార్యక్రమంలో నిర్మించిన పలు అంతర్గత రహదారులను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

---------------------------

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. రక్తదానం చేసే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, రక్తదానం పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించి... ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించేలా ప్రోత్సహించడం, రక్తదానం వల్ల శరీరానికి కలిగే మేలును తెలియజేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. రక్తంలోని గ్రూపులను కనుగొన్న ఆస్ట్రియా, అమెరికా దేశాల పౌరసత్వం కలిగిన జీవ శాస్త్రవేత్త, వైద్యులు కార్ల్ ల్యాండ్ స్టీనర్ జయంతి అయిన జూన్ 14ను రక్తదాతల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని వాతావరణ కేంద్ర అధికారి నారాయణ వెల్లడించారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని ఆయన పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడిచింది.

=====================